సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023

రోడ్డున్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు


బస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఆర్టీసీ అధికారులు


అరకులో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

- నడపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- పాడేరు–భద్రాచలం బస్సు సర్వీసు ప్రారంభం

పాడేరు రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లాలో తారు రోడ్డు ఉన్న ప్రతి మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మితో కలిసి శనివారం అయన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పాడేరు–భద్రాచలం బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. కొద్ది సేపు ఆర్టీసీ బస్సులో కూర్చొని ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, ఇతర సిబ్బందితో మాట్లాడారు. ప్రసుతం పాడేరు ఆర్టీసీ డిపోలో 46 బస్సులు మాత్రమే ఉన్నాయని, మరికొన్ని బస్సులు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని డీఎం వివరించారు. కొత్త జిల్లా కావడంతో రంపచోడవరం, అరకు, సీలేరు ప్రాంతాల్లో ఆర్టీసీ డిపోల ఏర్పాటుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భద్రాచలం వెళ్లే బస్సు ప్రతి రోజు ఉదయం 11.30 గంటలకు పాడేరులో బయలుదేరి 12.40గంటలకు అరకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి పాడేరు, చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, కూనవరం, నెల్లిపాక మీదుగా రాత్రి 11 గంటలకు భద్రాచలం చేరుంటుందని, మరుసటి రోజు ఉదయం 7గంటలకు భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.45 గంటలకు పాడేరుకు చేరుకుంటుందని ఆయన వివరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు మరింత మెరుగు పర్చాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాడేరు డిపో సామర్థ్యం పెంపునకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి మిషన్ కనెక్ట్ పాడేరు పేరుతో ఇప్పటికే పక్కా రోడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. రహదారులు పూర్తయితే ఆర్టీసీ బస్సులు నడిపేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. ప్రయాణకులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలకు గురికావద్దని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, వనుగు బసవన్నదొర, గొల్లోరి నీలకంఠం, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అరకులో..

అరకులోయ టౌన్: అరకునుంచి భద్రాచలానికి ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం ఇక్కడ అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు నుంచి వచ్చే ఈ సర్వీసు అరకులోయలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. పాడేరు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్సు సర్వీసు ప్రారంభించామన్నారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్ కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ ఎల్‌బీ భీమరాజు, మండలపార్టీ కన్వీనర్ సంపత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శులు శెట్టి వెంకటరావు, గోపాలరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తిన కుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బీ కిరణ్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్, శెట్టి గోపాలరావు, చ టారి కృష్టా రావు, సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మిరియం రైతుకు గిట్టుబాటు ధర

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- స్పైసెస్ బోర్డు అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: మన్యంలో మిరియాన్ని సాగు చేస్తున్న గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్పైసెస్ బోర్డు అధికారులతో కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజన రైతులు అత్యధికంగా వరి, పసుపు, రాజ్మా, అల్లం, కాఫీ, మిరియాన్ని సాగు చేస్తున్నారన్నారు. స్పైసెస్‌బోర్డును బలోపేతం చేసి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మిరియాలు పండిస్తున్న రైతులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లో మిరియాలకు మంచి ధర లభిస్తోందని, గిరిజన రైతులు కిలోకు రూ.నాలుగైదు వందల రూపాయలు మాత్రమే పొందుతున్నారన్నారు. కాఫీ, మిరియం క్రయ విక్రయాలు, రైతులకు గిట్టుబాటు ధరల కల్పనకు గ్రామ వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులకు అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఐదు కిలోల కాఫీ పండ్లకు కిలో పార్చిమెంట్ మాత్రమే వస్తుందన్నారు. మిరియాల వల్ల రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని చెప్పారు. కాఫీ 35వేల నుంచి 40 వేల మెట్రిక్‌టన్నుల ఉత్పత్తి చేస్తున్నారన్నారు. అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాలు సరాసరి 10 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే ఉత్పత్తి అవుతుందన్నారు. స్పైసెస్‌బోర్డు సహాయ సంచాలకులు కులదీప్‌రాయ్, విజీష్న మాట్లాడుతూ ఎస్‌టీడీఎఫ్ ప్రాజెక్టులో భాగంగా కాఫీ, మిరియాల రైతులకు ఉపయోగపడే విధంగా అల్యూమినియం నిచ్చెనలు, మిరియాల నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశామన్నారు. గిరిజన రైతులకు 20 వేల మిరియాల మొక్కలు, టార్పాలిన్లు అందజేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమారరావు, స్పైసెస్‌బోర్డు సీనియర్ క్షేత్రస్థాయి అధికారి బొడ్డు కల్యాణి, కాఫీబోర్డు ఉప సంచాలకులు రమేష్, స్పైసెస్‌బోర్డు సహాయ సంచాలకులు విజీష, ఆహార, వ్యవసాయ సంస్థ నేషనల్ ప్రాజెక్టు మేనేజర్ వినియ్‌సింగ్, డీపీఎం భాస్కరరావు, ఎగుమతి, దిగుమతి వాణిజ్యవేత్తలు, రైతు, ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో ఆశా కార్యకర్తల తాత్కాలిక జాబితా

- అభ్యంతరాలకు ఈనెల 5 వరకు గడువు
- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు రూరల్ : జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల భర్తీకి సంబంధించి తాత్కాలిక జాబితాను విడుదల చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత జాబితాను హెచ్‌టీటీపీఎస్://అల్లూరిసీతారామరాజు. ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని ఆయన పేర్కొన్నారు. ఈ జాబితా విషయంలో ఏమైన సందేహాలు ఉంటే సంబంధింత పీహెచ్‌సీ వైద్యాధికారిని స్వయంగా కలిసి ఈనెల 5వ తేదీలోగా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకోమన్నారు. అభ్యంతరాలను కలెక్టరేట్, ఐటీడీఏ, జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాల్లో స్వీకరించమని ఆయన పేర్కొన్నారు.

పాపికొండలు పర్యాటకానికి బ్రేక్

- తుఫాన్ ఎఫెక్ట్

వీఆర్‌పురం: మండలంలోని పోచవరం బోట్ పాయింట్ నుంచి కొనసాగే పాపికొండల పర్యటకాన్ని తుపాన్ ప్రభావం కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాపికొండల పర్యటక బోట్లను తాత్కాలికంగా నిలిపివేసేలా చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ శనివారం తెలిపారు. అలాగే అధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా పర్యాటక బోట్ల టికెట్ బుకింగ్‌ను కూడా నిలిపివేసినట్టు ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్ సీహెచ్ రాజేష్ తెలిపారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో బాలిక మృతి


సాహితీప్రియ (ఫైల్)

జి.మాడుగుల: మండలంలో బీరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక సాహితీ ప్రియ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ మృతి చెందింది. ఆమెకు ఆరోగ్య క్షీణించడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి గురువారం రాత్రి తరలించారు. ఇక్కడ వైద్యం పొందుతున్న సాహితీ ప్రియను తదుపరి వైద్యం కోసం కేజీహెచ్ తరలించాలని శుక్రవారం ఉదయం బాలిక తండ్రి నారాయణ వైద్యులను కోరారు. ఈ మేరకు రాత్రి కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గం మధ్యలో బాలిక మృతి చెందిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయమే అంబులెన్స్‌లో తరలించి ఉంటే తమ కుమార్తె బతికి ఉండేదని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందని ఆయన ఆరోపించారు.

ప్రశాంతంగా పీఎల్‌జీఏ వారోత్సవాలు


ఏవోబీలో తనిఖీలు నిర్వహిస్తున్న బలగాలు

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ తలపెట్టిన పీఎల్‌జీఏ వారోత్సవాలు ఏవోబీతో పాటు సరిహద్దు చత్తీస్‌గఢ్‌లోను తొలిరోజు ప్రశాంతత నెలకొంది. పోలీసు బలగాలు ఏవోబీ వ్యాప్తంగా గాలింపు చర్యలను ముమ్మురం చేసింది. జిల్లాలోని చింతూరుకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల్లోను పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఎస్పీ తుహిన్‌సిన్హా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.అన్ని ప్రధాన రోడ్లు,మారుమూల ప్రాంతాలకు పోయే జంక్షన్లలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. హిట్‌లిస్ట్‌లో ఉన్న పలు పార్టీల నేతలు సురక్షిత ప్రాంతాలకు పరిమితమయ్యారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


నిర్మాణ దశలో ఉన్న పీహెచ్‌సీ భవనాలను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి : భవన నిర్మాణాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ, వైద్యాధికారుల కోసం నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. రోగులు, సేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను ప్రసవ తేదీకి 15 రోజులముందు ఆస్పత్రిలో చేర్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, మెను ప్రకారం ఆహారం పెడుతున్నారా లేదా అని విద్యార్థుల నుంచి తెలుసున్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మార్కెట్, బోదులూరు నుంచి చట్లవాడ వరకు నిర్మిస్తున్న ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు పనులను పరిశీలించారు.పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరా కిషోర్, సర్పంచ్ కొండా జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్మారక ప్రాంతాలను పరిరక్షించాలి

అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు


మాట్లాడుతున్న పడాల వీరభద్రరావు

అడ్డతీగల: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడయాడి పోరాటం చేసిన స్మారక ప్రాంతాలను పరిరక్షించాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. శనివారం అడ్డతీగలలోని వినాయక తాపీ పనివారల సంఘ భవనంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు యువజన సంఘం రంపచోడవరం డివిజన్ నూతన కార్యవర్గం ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. అల్లూరి స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ప్రధాన ఘట్టాలు రంపచోడవరం డివిజన్లోనే జరిగాయన్నారు. అడ్డతీగల, రంపచోడవరం, రాజవొమ్మంగి పోలీసు స్టేషన్లపై దాడి చేయడం జరిగిందన్నారు. అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామం అల్లూరికి ప్రధాన స్థావరంగా ఉండేదన్నారు.అక్కడే ఆయన తపస్సు చేసిన తపస్వికొండ, గిరిజనుల సమస్యలు పరిష్కరించే రచ్చబండ ఉన్నాయన్నారు. తుదిపోరు చేసిన రాజవొమ్మంగి మండలం కొండపల్లి తదితర ప్రాంతాలు చరిత్రలో నిలిచాయన్నారు. వీటిని పరిరక్షించుకుని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల,రాజవొమ్మంగి నుంచి వచ్చిన ప్రతినిధులతో సభ నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.చోడిశెట్టి సుబ్బారావు (అధ్యక్షుడు),వాడపల్లి శేషాచార్యులు (ఉపాధ్యక్షుడు), లోతా రామారావు(ఉపాధ్యక్షుడు),లంకా ప్రసాద్(ప్రధాన కార్యదర్శి)పోలిశెట్టి అచ్యుత్(కోశాధికారి),అధికార ప్రతినిధులుగా దంగేటి సత్తిబాబు,సోమిరెడ్డి రాజు,రామన శ్రీను,న్యాయ సలహాదారుగా డి.శీధర్,మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

బొర్రాకు పర్యాటకుల తాకిడి

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు శనివారం పర్యాటకులతో కళకళలాడింది.సుమారు 3300 మంది పర్యాటకులు గుహలు అందాలను తిలకించగా రూ. 2.61 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. గతవారంతో పోలిస్తే ఈ వారం సందర్శిత ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి కాస్త తగ్గింది.

పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: తుఫాన్ ప్రభావం నేపథ్యంలో శనివారం మన్యంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.5, పాడేరు మండలం మినుములూరులో 15, అరకులోయలో 16.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలోని సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు బలగాల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు ఆవరణతోపాటు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



సారె ఊరేగిస్తున్న మహిళలు

సాక్షి,పాడేరు: పట్టణంలో గౌరీ పరమేశ్వరుల నెల రోజుల ఉత్సవాల్లో భాగంగా పట్టణ వీధుల్లో శనివారం సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహనికి సారెను మహిళలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మళ్ల పరమేశ్వరరావు,ఇతర ప్రతినిధులు కొణతాల సతీష్, మోహన్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

పాడేరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను త్వరితగతగతిన గుర్తించి, నివేదికలను అందజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి ఎలక్టోరల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 352 గ్రామ సచివాలయాలు ఉండగా 66 గ్రామ సచివాలయాలు రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయని చెప్పారు. అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన అవాంఛనీయ సంఘటనలు, సమస్యల గురించి ఆరా తీసి నివేదికలో పొందుపర్చాలన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లా అయినందున ఆ దిశగా ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రం పరిధిలో గత ఏడాది నుంచి జరిగిన అవాంఛనీయ సంఘటనలు కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. న్యాయ, కుల పరమైన గొడవలు, సమస్యలున్నా పోలింగ్ కేంద్రాలను సందర్శించి 45 రోజుల్లోగా నివేదికలు అందజేయాలని తెలిపారు. వాటిపై ఎస్పీతో చర్చించి తుది నివేదికను ఎన్నికల కమిషన్‌కు అందజేయనున్నట్టు చెప్పారు. తప్పుడు నివేదికలు ఇస్తే సంబంధిత సెక్టోరల్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన వెళ్లినప్పుడు ముందుగా పోలీస్ శాఖకు సమాచారమిస్తే తగిన రక్షణ కల్పిస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లు, యువత, రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం ద్వారా ఆయా ప్రాంతాల్లో సమస్యలు తెలుస్తాయని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్,ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పి.అంబేడ్కర్, సెక్టోరల్ అధికారులు, ఏఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల్లో తుఫాన్ కలవరం

అధికార యంత్రాంగం అప్రమత్తం

సాక్షి,పాడేరు: తుఫాన్ హెచ్చరికలతో జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం నుంచి వరిపంటను కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు,వరిపనల కుప్పలకు ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు కప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోను రెవెన్యూ అధికారులు అందేబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. గెడ్డ అవతల ప్రాంతాల్లోని గిరిజనులు వర్షాల సమయంలో గ్రామాలకే పరిమితమవ్వాలని, గెడ్డలు దాటి ప్రయాణాలను విరమించాలని కలెక్టర్ సూచనలు జారీ చేశారు. జలాశయాల్లో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. జిల్లాలోని రైతులంతా వరిపంట కోతలను తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు కోరారు.పంట భూముల్లో ప్రస్తుతం ఆరబెట్టిన వరిపనలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని,పంట కోతలు ప్రారంభించని భూముల్లో వర్షం నీరు సాఫీగా పాయే విధంగా కాల్వలు తవ్వుకోవాలన్నారు.

108లో సుఖ ప్రసవం



108 వాహనంలో తల్లీబిడ్డలు

జి.మాడుగుల: పురిటి నొప్పుల ప్రసవ వేదన పడుతున్న ఓ గిరిజన గర్భిణి 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో బిడ్డకు జన్మనిచ్చింది. పెదబయలు మండలం జలంపల్లి గ్రామానికి చెందిన తంగుల కనకమ్మ పురిటినొప్పులు రావడంతో జి.మాడుగుల మండలం పీహెచ్‌సీకి చెందిన 108 వాహనంలో శుక్రవారం సాయంత్రం తీసుకువస్తున్నారు. ఇంతలో మార్గం మధ్యలో ఆమెకు పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే ఆమెకు ఈఎంటీ బి.రామకృష్ణ, పైలెట్ ప్రసవం చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, వారిని స్థానిక పీహెచ్‌లో చేర్పించినట్టు వారు పేర్కొన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో డీఏవీ విద్యార్థులు విజయం



విజయం సాధించిన మోతుగూడెం డీఏవీ స్కూల్ విద్యార్థినులు

మోతుగూడెం: క్లస్టర్ క్రీడా పోటీల్లో స్థానిక డీఏవీ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీ అండర్– 14 బాలికలు, వాలీబాల్ అండర్ –14 బాలుర విభాగంలో వీరు విజయం సాధించారు.

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు హెచ్‌ఎం ఎం.రఘురాం, ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

మారేడుమిల్లి : మండలంలోని సున్నంపాడు పంచాయతీ పరిధిలోని తూర్పురు గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ పల్లాల సోమిరెడ్డి తాటాకిల్లు శనివారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామాన్లు, సర్టిఫికెట్లు కాలిపోయాయి. కట్టుబట్టలతో మాత్రమే మిగిలామని గ్రామ వలంటీర్ సోమిరెడ్డి వాపోయాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరాడు.

దోపిడీ వ్యవస్థను అంతమొందించాలి



మహాసభలో మాట్లాడుతున్న టాన్యా

రంపచోడవరం: దేశంలో కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థను అంతమొందించే పోరులో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా అన్నారు. రంపచోడవరంలో శనివారం పీడీఎస్‌యూ జిల్లా మహాసభ జిల్లా అధ్యక్షురాలు వి.మయూరి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో టాన్యా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. పీడీఎస్‌యూ 21వ మహాసభను పురస్కరించుకుని జూనియర్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

● మత్స్యగెడ్డ సొగసు చూడతరమా!



సూర్యాస్తమయం వేళ మత్స్యగెడ్డపై అద్భుత అందాలు ఆవిష్కృతమయ్యాయి. సుజనకోట పంచాయతీ బీట గ్రామ సమీపంలో మత్స్యగెడ్డను తాకిన భానుడి కిరణాలు పసిడి వర్ణాన్ని తలపించాయి. నాటు పడవపై గిరిజనుల ప్రయాణం ప్రకృతి అందాలకు మరింత వన్నెలద్దింది. – ముంచంగిపుట్టు

ప్రభుత్వం దృష్టికి పాస్టర్ల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బాలస్వామి

రంపచోడవరం: జిల్లాలోని పాస్టర్లు, క్రైస్తవ సమాజం అవసరాలు, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని క్రిస్టియన్ అఫైర్స్, మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సలహాదారు డా.ఫాదర్ ఎం. బాలస్వామి తెలిపారు. ఇక్కడికి సమీపంలోని జాగరంపల్లిలో శనివారం క్రిస్టియన్ మైనారిటీ ఆత్మీయ సమ్మేళన, సంక్షేమ సభ నిర్వహించారు. రాష్ట్రంలోని పలు వురితోపాటు జిల్లాలోని 22 మండలాల నుంచి పాస్టర్లు, క్రైస్తవ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎం.నిస్సికుమార్, జనరల్ సెక్రటరీ జెకార్య, ఏపి స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా కొమనాపల్లి, డా. రైమో జూహాని హలొనేన్ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న మత్స్యరాస వెంకటలక్ష్మి

జి.మాడుగుల: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సేవలందించాలని జి.మాడుగుల జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి సూచించారు. మండల అధికారులతో ఆమె శనివారం మండల పరిషత్ సమావేశం మందిరంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం పలుశాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోహిత్ జయ సాగర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కల్యాణి, తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీటీసీలు సన్యాసిదొర, అప్పలరాజు, అప్పారావు, సర్పంచులు కిముడు రాంబాబు, మాలన్న, పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్, సొందొర, ఏపీఎం సుందరమ్మ, సిడీపీవో సువర్ణమ్మ, ఏటీడబ్ల్యూవో తిరుపాల్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ పాడేరు మండల నూతన కార్యవర్గం

పాడేరురూరల్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(257) పాడేరు మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం పాడేరులో నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ పాడేరు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా కిల్లు పోతురాజు, ప్రధాన కార్యదర్శిగా వారం భైరవమూర్తి నాయుడు, గౌరవఅధ్యక్షుడిగా డి.బాబూరావు, మహిళ అధ్యక్షురాలిగా ఎస్.శాంతికుమారి, మహిళ ప్రధాన కార్యదర్శిగా బి.సుశీల, ఉపాధ్యక్షులుగా వి.కొండబాబు, సీహెచ్. గోవిందరావు, కె.దేవసన్‌దొర, వి.సూర్యమణి, సీహెచ్.అప్పారావు నాయుడుతో పాటు మరికొంత మంది కార్యదర్శులు, కౌన్సిలర్లు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.